102 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు

ప్రజాశక్తి-రాయచోటి

కలెక్టరేట్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన 102 అడుగుల జాతీయ జెండాను కలెక్టర్ గిరీష, జెసి తమీమ్ అన్సారీయా, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే అత్యంత పెద్ద జాతీయ పతాకం, ఎత్తయిన స్థూపం ఇదే కావడం గమనార్హమన్నారు. జిల్లా వాసుల్లో దేశభక్తిని రగిలించేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా 102 అడుగుల ఎత్తు ఉన్న స్థూపంపై ఏర్పాటు చేసిన భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించామన్నారు. దేశభక్తిని పెంపొందించే దిశగా అతి పెద్ద జాతీయ జెండా తమ చేతుల మీదుగా ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కలెక్టరేట్‌లో జాతీయ పతాకం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందిన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, విశ్వనాథరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది : కలెక్టర్

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి -రాయచోటి

ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గిరీష తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రం రాయచోటిలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని బంగ్లా నుంచి ర్యాలీగా సాయి శుభ కళ్యాణ్ మండపం వద్దకు చేరుకుని అనంతరం అక్కడ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌డిఒ రంగస్వామి అధికారులు, విద్యార్థులచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెమోక్రసీని కాపాడుకోవాలంటే ఒకే ఒక్క ఆయుధం ఓటు అన్నారు. ఒక ఓటు ఒక మంచి సమాజాన్ని సృష్టిస్తుందన్నారు. ఓటు వజ్రాయుధం అందుకే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు అవసరన్నారు. ప్రజాస్వామ్య మనుగడకు ఓటుహక్కే ఆధారమన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల మన డెమోక్రసీ ఇంత గట్టిగా నిలబడడానికి కారణం మన రాజ్యాంగమన్నారు. మనకు స్వాతంత్రం వచ్చినప్పుడు మనతోపాటు 125 దేశాలకు స్వాతంత్రం ఇచ్చారన్నారు. చాలా దేశాలలో సివిల్ రైట్స్ లేవన్నారు. దేశపౌరునికి దేశం ఇచ్చిన గొప్ప బహుమతి ఓటు హక్కు అని తెలిపారు. మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకొనే శక్తి ఓటు ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. అందువల్ల ఓటు వివేకంతో, విజ్ఞతతో వేయాల్సిన బాధ్యత పౌరులపై ఉందన్నారు. మనల్ని పాలించే అవకాశాన్ని మంచి వారికి, సమర్థులకు ఇవ్వడం ద్వారా ఇది సాధ్యపడుతుందన్నారు. భవిష్యత్తులో 30 ఏళ్లు మన దేశాన్ని ఎలా తీసుకెళ్లాలి అని ఆలోచన ప్రతి ఒక్క యువతీ, యువకుల్లో ఉండాలన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో, ప్రజాస్వామ్య మనుగడకు ఓటుహక్కే కీలకమని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరూ ఓటు హక్కును పొందితీరాలని, దానిని తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఆర్‌డిఒ రంగస్వామి మాట్లాడుతూ కుల, మత, వర్గ విచక్షణ లేకుండా ప్రతీ ఒక్కరికీ మన రాజ్యాంగం ఓటుహక్కు కల్పించిందన్నారు. ఓటుహక్కు పొందడం, దానిని సక్రమంగా వినియోగించుకోవడం పౌరుని బాధ్యత అని తెలిపారు. నూతన ఓటర్లకు కలెక్టర్ ఎపిక్ కార్డులను అందజేశారు. అనంతరం సీనియర్ సిటిజన్లు సుబ్బమ్మ, రెడ్డమ్మ, ఆదిలక్ష్మి, శ్రీహరిబాబు, ఆదినారాయణలను కలెక్టర్ ఘనంగా శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, తహశీల్దార్ రవిశంకర్ రెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర నాయకులు శ్రీనివాసరాజు, మున్సిపల్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'భారతజాతి గుండె చప్పుడు మహాత్మాగాంధీ'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

భారతజాతి గుండె చప్పుడు మహాత్మా గాంధీ అని కలెక్టర్ గిరీష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌కు ఎదురుగా ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ దేశభక్తి, చిత్తశుద్ధి, నిజాయితీ, సేవా భావాలు అందరికీ ఆదర్శం కావాలన్నారు. సమస్త మానవాళి అహింస, శాంతి, సౌభ్రాతృత్వంతో సుఖంగా జీవించాలనే మహాత్ముని సిద్ధాంతం, ప్రవచనం ఏనాటికైనా సరే విశ్వజనీనం, సార్వజనీనం, శాశ్వతం. దాన్నెవరూ తుడిచేయలేరన్నారు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సత్యం, అహింసలు గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలని, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయన ఆయుధాలని, కొళాయికట్టి, చేత కర్ర పట్టి, నూలు ఒడికి, మురికి వాడలు శుభ్రం చేసి, అన్నీ మతాలు ఒక్కటేనని చాటి చెప్పి రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య పాలనకు చమరగీతం పాడారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ భారతీయుల హృదయాలలో నిలిచిన అమరజీవి అని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, తహశీల్దార్ రవిశంకర్ రెడ్డి, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, విశ్వనాథరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్

గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

'జిల్లా కేంద్రాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతాం'

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా కేంద్రాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతామని కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రం రాయచోటిలో నూతనంగా నిర్మించిన స్టేట్ గెస్ట్‌హౌస్‌ను జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతిథులు బస చేసేందుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అధునాతన టెక్నాలజీతో నూతన స్టేట్ గెస్ట్‌హౌస్ నిర్మించామన్నారు. జిల్లా కేంద్రం రాయచోటిలో అదనాతనమైన టెక్నాలజీ అన్ని హంగులతో విశాలమైన స్థలంలో స్టేట్ గెస్ట్‌హౌస్ నిర్మించడం గర్వకారణమన్నారు. జిల్లా కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా కేంద్రాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడని ఆర్‌బికెలు

చెన్నూరు: ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఆర్‌బికెలు రైతులకు ఉపమోగపడటం లేదని టిడిపి రైతు విభాగం రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక అధ్వాన స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. అధిక వ్యయం, కూలీల కొరత ఏర్పడుతుందన్నారు. కొన్ని రోజులుగా రసాయనిక ఎరువుల కొరత ఉందని తెలిపారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం ప్రకటన చేస్తున్న క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంటే రాష్ట్రం ఎలా ఉంటుందన్నారు. సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు కల్లూరు విజయభాస్కర్‌రెడ్డి, తెలుగు జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఖాజాహుస్సేన్, బిసి సెల్ అధ్యక్షులు బాబు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

భారత జాతిని జాగృత పరిచిన ఆదర్శమూర్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఎమెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌కు ఎదురుగా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా, న్యాయశాస్త్ర నిపుణుడు, ఆర్థిక వేత్త, సామాజిక శాస్త్రజ్ఞుడు, చరిత్ర కారుడు,రాజనీతి కోవిదుడుగా అంబేద్కర్ పేరు ప్రఖ్యాతులు పొందారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడల్లో వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాల కోసం కృషి చేస్తున్నారన్నారు. నేటి తరానికి అంబద్కర్ స్ఫూర్తి ప్రదాతని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచి, వారి ఆశయ సాధనకు కృషి చేద్దామని కోరారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

పర్యాటక ప్రాంతాలపై అవగాహన అవసరం : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో జిల్లా పర్యాటక శాఖ వారి ఆధ్వర్యంలో జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెసి మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలు, వాటి యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సెలవు దినాలలో విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించాలన్నారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించడం వల్ల ఆనందంతో పాటు విజ్ఞానాన్ని కూడా పొందవచ్చునన్నారు. పర్యాటక ప్రాంతాలపై సమాజంలో అవగాహన పెంపొందించడానికి ప్రతి ఏడాది జనవరి 25వ తేదీన దేశవ్యాప్తంగా జాతీయ పర్యాటక దినోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి విశేష కృషి చేస్తోందన్నారు. పర్యాటక ప్రాంతాలు అభివ ృద్ధి చేయడం వల్ల ఆ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నమయ్య నూతన జిల్లాలో హార్సీ హిల్స్, వెలిగల్లు, శిల్పారామం వంటి వివిధ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు వాటి ప్రాముఖ్యతపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినిలు వేసిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అప్పలాం, ఇరిగేషన్ ఎస్ఇ కృష్ణమూర్తి, జిల్లా పర్యాటక శాఖ మండలి సభ్యులు ప్రసాద్, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులురెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి నాగరాజు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జెసి తమీమ్ అన్సారీయా

సా..గుతున్న రబీ

- కడప జిల్లాలో 67, అన్నమయ్యలో 47 శాతమే
- లక్ష్యాన్ని చేరని వరి, వేరుశనగ, పత్తి సాగు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రబీ సీజన్ సా..గుతోంది. జిల్లాలోని 36 మండలాల్లో నాలుగో వంతు మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన 28 మండలాల్లో 25 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కావడం ఊరట కలిగించింది. ఈలెక్కన మిగిలిన మూడు మండలాల్లోనే పూర్తిస్థాయి వర్షపాతం నమోదైనట్లు కనిపిస్తోంది. ఇటువంటి వర్షాభావ పరిస్థితుల్లో వరి, వేరుశనగ, పత్తి పంటల సాగు లక్ష్యాన్ని చేరుకోవడంలో మూడో వంతుకు పరిమితం కావడం ఆందోళన కలిగి స్తోంది. ఈలెక్కన సాగు శాతాన్ని పరిశీలిస్తే కడప జిల్లాలో 67 శాతం, అన్నమయ్య జిల్లాలో 47 శాతం విస్తీర్ణంలో మాత్రమే విత్తనం పడింది. మిగిలిన 53 శాతం సాగు వర్షాభావ పడగ నీడన ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

కడప జిల్లాలో రబీ సీజన్ నత్తనడకన సాగుతోంది. 2022-23 రబీలో 3,77,030 ఎకరాల్లో పంటలు సాగు చేయాలనేది జిల్లా వ్యవ సాయశాఖ లక్ష్యం. నవంబర్ ఒకటి నుంచి జనవరి నెలాఖరు వరకు సాగు చేయాల్సి ఉంది. నవంబర్‌లో 19.4 డిసెంబర్‌లో 268 శాతం లోటు వర్షపాతం నెలకొన్న ఒడిదుడుకుల నేపథ్యంలో మందకొడిగా సాగుతోంది. నవంబర్ నుంచి నేటి వరకు 28 మండలాల్లో ఆశాజనకంగా వర్షపాతం నమోదు కావడంతో 2.53.230 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. మరో 1,23,800 ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉంది. ఈలెక్కన సాగు తీరుతెన్నులను పరిశీలిస్తే 67 శాతం విస్తీర్ణంలో పంటలు సాగు కావాల్సి ఉంది. అన్నమయ్య జిల్లాలో సాగు పరిస్థితులను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్స రంలో 1,71,822 ఎకరాల సాధా రణ సాగు లక్ష్యానికి గానూ 81,802 ఎకరాల్లోనే విత్తనం పడినట్లు తెలు స్తోంది. ఈలెక్కన 47 శాతం మాత్రమే సాగు చేసినట్లు తెలుస్తోంది. వర్షా భావ పరిస్థితుల నేపథ్యంలోనే మిగిలిన 53 శాతం సాగుకు నోచు కోవడం లేదనే వాదన వినిపిస్తోంది.

బద్వేల్‌లో లోటు వర్షపాతం

బద్వేల్ డివిజన్‌లోని కాశినాయన, పోరుమామిళ్ల, కలసపాడు, మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. సదరు మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం రబీ సీజన్‌లో పంటల సాగు మందగించింది. నవంబర్ డిసెంబర్‌లో లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో సాగు లక్ష్యంపై ప్రభావం చూపించింది. రబీ సీజన్‌లో పంటల సాగు దశ నుంచి నేటి వరకు 639.2 మి.మీ వర్షపాతం నమో దు కావాల్సి ఉండగా 632.7 మి.మీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఈలెక్కన కడప జిల్లా వ్యాప్తంగా -6.3 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లావ్యాప్తంగా సానుకూల, లోటు వంటి మిశ్రమ వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో రబీ సీజన్ సాగు లక్ష్యాన్ని చేరుకోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నా యి.

చాపాడు వద్ద సాగులో ఉన్న వరి పంట

తగ్గిన సిరి ధాన్యాల సాగు!

జిల్లాలో సిరిధాన్యాల సాగు తగ్గుముఖం పట్టింది. జిల్లా వ్యాప్తంగా 37,205 ఎకరాల్లో 30 రకాల పంటల్లో సిరిధాన్యాలు సాగు ప్రశ్నార్థకంగా మారింది. కొర్రలు, అరికెలు, సోమలు, వరిగ, ఊదలు వంటి సిరిధాన్యాల 12,674 ఎకరాలకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. సిరిధాన్యాల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో సాగుకు అవకాశమే లేకుండా పోయినట్ల తెలుస్తోంది. వీటిని మినహాయిస్తే జిల్లాలోని ప్రధాన ఆహార పంటలైన వరి 27,795 ఎకరాలు, బుడ్డశనగ 2,42,035 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 1,77,405 ఎకరాల్లో, జొన్న 24,610 ఎకరాలు, వేరుశనగ 20,630 ఎకరాలు, పత్తి 5004 ఎకరాల్లో మూడో వంతు సాగుకు నోచుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇదిలాఉండగా మినుములు 15,925 ఎకరాల్లో సాధారణ సాగు లక్ష్యానికి గానూ 28,338 ఎకరాల్లో రెట్టింపు సాగు కావడం ఊరటను కలిగిస్తోంది.

రబీ లక్ష్యాన్ని అధిగమిస్తాం

రబీ సాగు లక్ష్యాన్ని చేరుకుంటాం. నేటికి 67 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. మిగిలిన 33 శాతంలో పంటల సాగు కావాల్సి ఉంది. ఫిబ్రవరి నెలాఖరు నాటికి లక్ష్యాన్ని సునాయాసంగా అధిగమిస్తాం

- నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి, కడప.

'ఫేస్ యాప్' రద్దు చేయాలి

సిడిపిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీల నిరసన

ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అంగన్వాడీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తల పోస్టులను ఆయాలతో భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఐదేళ్ల టిఎ, డిఎ మంజూరు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కార్యకర్తలకు రూ.5 లక్షలు, ఆయాలకు రూ.3 లక్షలు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలలో రాజకీయ జోక్యం తగ్గించాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.వేయి అదనంగా వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచిపోయినా కార్యకర్తలకు రూ.11,500లకే వేతనాన్ని పరిమితి చేశారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీలకు రూ.13,600లు వేతనం అందిస్తోందని, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రం గత వేతనాన్నే కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పెనగలూరు మండల కార్యదర్శి మద్దెల ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు ఎం.ఈశ్వరమ్మ, పి.వి.శివరంజని, ఎస్.అమరావతి, ఎం.విజయమ్మ, షకీలా భాను, చెంచులక్ష్మి, శిరీష, అన్నపూర్ణమ్మ, వనిత, సునీత, రేవతి, ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు తగవు : ఫ్యాప్టో

బద్వేలు : విద్యాశాఖాధికారులు ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను వేధించాలని చూస్తే ఉద్యమ బాట పట్టక తప్పదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలను సందర్శించే పేరుతో చిన్న చిన్న కార ణాలను సాకుగా చూపి ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం, షోకాజు నోటీసులు జారీ చేసి వేధిం చడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విద్యాశాఖా ధికారులు పాఠశాలలను సందర్శించడం, తనిఖీలు చేయడం మంచి పరిణామమేనన్నారు. ఆ పేరుతో చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి ఉపాధ్యా యులను వేధించడం తగదన్నారు. విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు వల్ల ఉపాధ్యా యులు తీవ్ర ఒత్తిడిలకు గురవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు విద్యావ్యవస్థను బలోపేతం చేసేలా వ్యవహరించాలే తప్ప, షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లు చేయడం సరికాదన్నారు. అధికారుల పరిశీలనలో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వాటిని ప్రధానోపాధ్యాయులతో, ఉపాధ్యాయులతో చర్చించి, లోపాలను సరి చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. అన్నమయ్య జిల్లా డిఇఒ రాఘవరెడ్డి ఆ జిల్లాలో జిల్లా విద్యాశాఖాధికారి హోదాలో, కడప జిల్లాలో డైట్ ప్రిన్సిపల్ హోదాలో పాఠశాలలను తనిఖీలు చేస్తూ, తనిఖీ చేసిన ప్రతిచోటా ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను వేధించడం మానుకొని, క్షేత్రస్థాయిలో ఉండే లోపాలను స్నేహపూరిత వాతావరణంలో సరిచేస్తూ విద్యారంగాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

కబడ్డీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష

కబడ్డీ ఛాంపియన్ షిప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా స్థాయి కబడ్డీ ఛాంపియన్ షిప్ పోస్టర్‌ను కలెక్టర్ గిరీష బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. విద్యార్థులలో క్రీడలను ప్రోత్సహించడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి యూత్ ఐకాన్ వినయ్ కుమార్‌ను అభినందించారు. ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ పట్టణం పరిధిలోని ఐకె పాఠశాల అవరణలో జిల్లా స్థాయి కబ్బడీ ఛాంపియన్ షిప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 30వ తేదీన బాలురకు, 31న బాలికలకు పోటీలు నిర్వహించి వీటిలో ప్రతిభ చూపిన వారికి ఫిబ్రవరి 1వ తేదీన ఫైనల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలలో పాల్గొనే పాఠశాల టీములు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులకు వసతి, భోజనం ఉచితంగా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌రాజు, అర్చన విద్యా సంస్థల కరస్పాండెంట్ మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు సాహిత్య పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

అరసం జిల్లా మహాసభను పురస్కరించుకుని ఈ నెల 26 సిపి.బ్రౌన్ గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు అరసం జిల్లా అధ్యక్షులు ఎన్.ఈశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని పాఠశాల విద్యార్థులు (పదవ తరగతి వరకు) ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఐదవ తరగతి వరకు జూనియర్ విభాగం, ఆరు నుంచి పదవ తరగతి వరకు సీనియర్ విభాగాలుగా పోటీలు ఉంటాయని తెలిపారు. రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. కథ చెప్పడం, పద్య పఠనం, వివరణ, కవిత్వ రచన వంటి పోటీలు ఉంటాయన్నారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలతో పాటు ఉపయోగకర పుస్తకాలను ఈ నెల 29న జరగనున్న అరసం జిల్లా మహాసభల్లో బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు.

వైసిపి పాలనకు చమరగీతం పాడాలి : ఆర్ఆర్

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో అవినీతి అరాచక ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి చమరగీతం పాడుదామని మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని 10, 11వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్టానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా వార్డులలో ఇంటింటికీ తిరుగుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాల గురించి,ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రజలకు తెలియజేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగు పూర్తి అవుతున్న దోచుకో దాచుకో అనే నినాదంతో ముందుకు సాగుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసిపి నేతలు భూకబ్జాలకు పాల్పడడం, ఇసుకను, మట్టిని అక్రమంగా తరలించడం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంలో సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు, వేధింపులు పెరిగిపోయాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్యులు కొనలేక, తినలేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలీ, రూరల్ అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి నిస్సార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ హుస్సేన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, మన్సూర్, సోనిరాజ్ కలీమ్, వీర భద్ర స్వామి గుడి మాజీ చైర్మన్ ఎద్దుల లక్ష్మీ ప్రసాద్, ముబారక్, అత్తర్ జావిద్, జగదీష్, రాయఛోటి తెలుగు యువత శేషి జాబీర్, సయ్యద్, ఇలియాజ్, సత్యరెడ్డి, మాజీ కౌన్సలర్ మహబూబ్ భాష, సోనీ రాజ్ కలీమ్, సర్దార్, ఇనాముల్లా, సాహుద్, జగదీష్ పాల్గొన్నారు.

పట్టణంలో చెత్తను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

చేపల చెరువులకు వేలం పాట నిర్వహిస్తున్న ఎంపిడిఒ లీలామాధవి

వేలం పాట ఆదాయం రూ.2.42 లక్షలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

చేపల చెరువుల వేలంపాట ద్వారా సామకోటవారిపల్లి గ్రామ పంచాయతీకి రూ.2.42 లక్షలు ఆదాయం చేకూరినట్లు ఎంపిడిఒ లీలామాధవి తెలిపారు. బుధవారం గ్రామ సచివాలయంలో సర్పంచు మహాదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మంజుల, నాగమల్లి ఆధ్వర్యంలో ఆరునెలల కాలవ్యవధికి గాను చేపలచెరువుల వేలంపాటను నిర్వహించారు. సుమారు 20మంది వేలంపాట దారులు డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. 12 చెరువులకు వేలంపాట నిర్వహించగా రూ.2.42లక్షలు ఆదాయం సమకూరిందన్నారు. తరిగొండవారిపల్లెకు చెందిన పి.రెడ్డప్పరెడ్డి తొట్లిచెరువును అత్యధికంగా రూ.93వేలకు దక్కించుకున్నారు. బాలిరెడ్డి చెరువును రూ.50వేలకు వై.రమణారెడ్డి సొంత చేసుకున్నారు. వేలంపాటదారులు సంబంధిత చెరువులలో జూన్ 30వ తేది వరకు చేపలపెంపకం, చేపలవిక్రయం చేసుకోవచ్చని ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు దయాకర్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, శశిధర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

10న శ్రీగంధం సాగుపై శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి 10న ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఐడబ్ల్యూఎస్‌టి ఆధ్వర్యంలో శ్రీగంధం సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కెవికె సమన్వయకర్త డాక్టర్ జ్యోత్స్న పేర్కొన్నారు. ఐడబ్ల్యూఎస్‌టి శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్‌చక్రవర్తి, గిరిబాబు సాగులో మెలకువలపై రైతులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. శీగంధం సాగులో రైతులకు ఉన్నటువంటి సందేహాలకు సూచనలు, సలహాలు ఇస్తారని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఇతర శాఖల నిర్మాణాలొద్దు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అంబేద్కర్ భవనానికి కేటాయించిన స్థలంలో ఇతర శాఖలకు సంబంధించిన భవనాలు నిర్మించవద్దని డిమాండ్ చేస్తూ బుధవారం భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో పట్టణంలోని జ్యోతి బస్టాండుదగ్గర ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం తహశీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. స్థానిక ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బి.కొత్తకోట, పిటిఎం, ములకలచెరువు మండలాలకు సంబంధించిన ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాస్ నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్‌భవన్‌కు కేటాయించిన స్థలంలో ఇతర భవనాలు నిర్మించడం సిగ్గుచేటని, ఇది రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించడమేనని అన్నారు. కబ్జాదారులపై అధికారులు వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ ఈనెల 27 నుంచి చేపడుతున్న యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు పఠాన్ ఖాదర్‌ఖాన్ ఆధ్వర్యంలో రాజంపేట పార్లమెంటు కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బంగారు భవిత కోసం, రైతుల కోసం, మహిళల భద్రతకోసం, రాష్ట్రప్రగతికోసం లోకేష్ కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు 400 రోజులు, 4000 కిలోమీటర్లు పాదయాత్ర చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అక్రమ్, అల్లావుద్దీన్, ఇనాయిత్, సద్దాం హుసేన్, నూరుల్లా, దొరస్వామి నాయుడు పాల్గొన్నారు.

హోమియో మందులు వితరణ

ప్రజాశక్తి -రాయచోటి టౌన్

స్థానిక ప్రభుత్వ హోమియో వైద్యశాలకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగరాజు పదివేల రూపాయలు విలువ చేసే మందులు అందించినట్లు హోమియో వైద్యులు సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజులకాలనీలో నివాసముండే రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగరాజు, డిసిహెచ్ఎస్ చంద్రశేఖర్ చేతుల మీదుగా మందులు హోమియో వైద్యశాలకు అందించినట్లు తెలిపారు.

పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న డిఇఒ రాఘవరెడ్డి

తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పాఠశాలకు వెళుతున్న విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పక ఉండాలని డిఇఒ రాఘవరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని దివ్యతేజ ఉన్నత పాఠశాలలో 25వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమపిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, వారిని ఎప్పుడూ పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. టివిలకు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. చదువు పట్ల మక్కువ పెచ్చే విధంగా వారిని ప్రోత్సహించాలని సూచించారు. మంచి ప్రవర్తన, క్రమశిక్షణను నేర్పించాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను కంటికిరెప్పలా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు శ్రీనివాసరాజు, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ఎఒ శివశంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిడి కళాశాలలో ఇంటర్మీడియట్ మొదట సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హర్షవర్ధినికి విభిన్నప్రతి భావంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశారు. విద్యార్థిని కళాశాలలో ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని సంఘం అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి ఎపి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డికి దృష్టికి తీసుకపోగా ఆయన వెంటనే స్పందించి ఫీజుకు అవసరమైన నగదును అందించారు. సంఘఅధ్యక్షుడు మల్లు సుబ్బ నరసారెడ్డి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ రాజుకి అంద జేశారు. కార్యక్రమము నందు సంఘ ఉపాధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసింహులు, వాలంటీర్ మురళీ, అమీర్ పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కు చెక్కును అందజేస్తున్న సంఘం అధ్యక్షులు సుబ్బ నరసారెడ్డి

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు

సీనియర్ ఓటర్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరములు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు మన హక్కుగా భావించి, ఓటర్లుగా నమోదు చేసుకుని నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. తహశీల్దార్ కార్యాలయం నుండి స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ వెళ్లి, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాము, ఎంపిడిఒ సిహెచ్.నారాయణ, ఎఎస్ఒ రెడ్డప్పనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ సయ్యద్అహ్మద్, ఆర్ఐ మస్తాన్‌కమలాకర్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, విఆర్ఎలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **రామసముద్రం :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మురళీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులతో జాతీయ ఓటరు దినోత్సవం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తాహశీల్దార్ విశ్వేశ్వరశాస్త్రి పాల్గొని మాట్లాడారు. భారత ప్రజాస్వామ్యపరిరక్షణ కోసం, నావంతు కర్త వ్యాన్నిగుర్తించి, ఉన్నతమైన నాయకుడిని ఎన్నుకుంటాననిప్రతిజ్ఞ చేయించారు. **నిమ్మనపల్లి :** తహశీల్దార్ సిఆర్.మంజుల ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని రెవెన్యూ అధికారులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని సీనియర్ ఓటర్లను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిటిలు తపస్వని, సిరాజుద్దీన్, ఆర్ఐ రాంప్రసాద్, మండల సర్వేయర్ మురళి నాయక్, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు. **గాలివీడు :** స్థానిక డిటి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో బాలికల ఉన్నతపాఠశాల, బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో రీసర్వే డిటి రెడ్డిబాబు, సర్వేయర్ మనీషా, బాబాజీ, ఆర్ఐ బిఎల్.వేలు, వెంకటేశు కుమార్, చిట్టి, నరేంద్ర, పిఇటి రామాంజులునాయక్, ఉపాధ్యాయులు నారాయణమ్మ, భాస్కర్ పాల్గొన్నారు. **వీరబల్లి :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2 ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తాహశీల్దార్ తులశమ్మ, ఎంపిడిఒ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపల్ రఘురామయ్య, ఎంఇఒ గిరి వరదయ్య, విఆర్‌డిఎస్ సురేంద్ర రెడ్డి, విఆర్ఒ నిర్మల్ కుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు భాస్కర్, రామనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, తహశీల్దార్ ధనుంజయులు, ఎంఇఒ రెడ్డి శేఖర్, నగర పంచాయతీ ఆర్ఐ శ్రీనివాసులు, ఎఎస్ఐ బొజ్జ నాయక్, కానిస్టేబుల్ శేఖర్, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, టిడిపి రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్‌తాజ్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** తహశీల్దార్ కళావతి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే ర్యాలీ, మానవమారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు, ఎంపిడిఒ ఆనంద్ కుమార్, హెచ్ఎం ఆంజనేయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులుతో ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు నిర్మలా దేవి, ఎంపిడిఒ శ్రీధర్ రావు, ఎంఇఒ మనోహర్ ,విఆర్ఒలుపాల్గొన్నారు.

మధ్యాహ్నభోజనంలో మెనూ పాటించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

భోజనాన్ని పరిశీలిస్తున్న జిసిడిఒ రాధ

ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం పిల్లలకు భోజనాలు పెట్టాలని జిసిడిఒ రాధ పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటలు రుచి పరిశీలించి పిల్లలకు మెనూ ప్రకారం ఎంతెంత వడ్డించాలన్న విషయాలపై ఆరా తీశారు. పాఠశాలలో రికార్డులు పరిశీ లించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె పేర్కొన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే ఐఐటిలలో సీటు సాధించి మంచి భవిష్యత్తు పొందవచ్చు అన్నారు. ఆడపిల్లలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ, శుభ్రంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఉమాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

తేక్వాండోతో ఆత్మరక్షణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తేక్వాండోతో ఆరోగ్యంతో పాటు ఆత్మ రక్షణ కూడా పొందవచ్చునని మాస్టర్ పిచ్చయ్య తెలియజేశారు. పట్టణం లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని తేక్వాండో శిక్షణ తరగతులు నిర్వహించారు. మాస్టర్ పిచ్చయ్య ఆధ్వర్యంలో జిల్లా కోచ్, జాతీయ రెఫరీ సగినాల రిజ్వాన్, జాహిద్‌అలీ పర్యవేక్షణలో తేక్వాండో బెల్ట్‌టెస్ట్‌తో పాటు ఈ నెలలో అనకాపల్లిలో జరగబోవు అంతర్ జిల్లా పోటీలకు ఎంపికలు నిర్వహించారు. బ్లూబెల్ట్ టెస్ట్‌కి అర్హత పొందినవారిలో డి.హర్షవర్ధన్, ఎస్.ఉమర్, టి.జశ్వంత్, జైదీప్, జి.చైతన్య తేజ్ , సయీద్ ఉమర్‌లు ఉండగా, అంతర్ జిల్లాల పోటీలకు టి.రెడ్డి ప్రశాంత్ నాయుడు, ఎస్ఎండి.హనీఫ్, టి.జశ్వంత్‌లు ఎంపికయ్యారని మాస్టర్ తెలియజేశారు.

యువగళం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కేలండర్‌ను బుధవారం మండల కేంద్రంలో టిడిపి మండలాధ్యక్షుడు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కుప్పం నుంచి నారా లోకేష్ చేపట్టే పాదయాత్ర వియజవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఎస్‌టిసెల్ అధ్యక్షుడు అవికే నాయక్ తాండసర్పంచ్ నటరాజ నాయక్, సుధాకర్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు,పాల్గొన్నారు.

విజేత జట్టుకు కప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే 'మేడా'

ప్రజాశక్తి-నందలూరు

యువత విద్యలోనే కాక క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడ మల్లికార్జున్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని జనాబ్ ఎస్‌టి కాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరవపల్లె క్రీడా మైదానంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో కడప స్పోర్ట్స్ అథారిటీ జట్టు విజేతగా నిలిచి రూ.10వేలు నగదు, షీల్డ్‌ను గెలుపొందారు. రన్నర్స్‌గా అరవపల్లె జట్టు రూ.7వేలు నగదు , షీల్డ్ గెలుపొందారు. తృతీయ బహుమతి రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజ్, నాలుగవ బహుమతిని నాగిరెడ్డి పల్లె గెలుపొందాయి. మహిళల విభాగంలో కడప మహిళా జట్టు విజేతగా నిలిచి రూ.10వేలునగదు, రన్నర్స్ వేంపల్లిజట్టు రూ.7వేలునగదు, షీల్డ్ గెలుపొందాయి. ఈ సందర్భంగా ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి సుబ్బారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, నడిపి సుధా కర్, మదన్, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీం, ఎజిపి సెమీవుల్లా, హిమ గిరినాథ్‌యాదవ్, తుమ్మలశ్రీధర్, ఓర్సుశీను, ఆర్గనైజర్ గ్రీష్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్, ఆర్ఎస్ఎఫ్, ఆర్‌విఎస్, ఎన్ఎస్‌యుఐతో జిల్లా విద్యార్థి జెఎసి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డివైఇఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాలనాయకులు మాట్లాడుతూ 120 ఏళ్ల క్రితం నాటి పాత భవనంలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారని భవిష్యత్తులో ప్రమాదవశాత్తు కూలితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పాఠశాలపై చర్యలు తీసుకోక పోతే 27న డివైఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉత్తన్న, జయప్రకాష్, వినయ్, ఆదినారాయణ, నయాజ్, మంజునాథ, గణేష్, వంశీ,సబిరుల్లా, రాజశేఖర్ ఉన్నారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జిల్లా ప్రోగ్రాంఅధికారి, సిహెచ్ఒ నారాయణ, డాక్టర్ సానేశేఖర్, డాక్టర్ మనోజ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయాలవారీగా గర్భిణులు, బాలింతల నమోదు, సాధించిన ప్రగతి, ప్రమాదకర గర్భిణుల గురించి తెలుసుకున్నారు. టిఒటీకాలు, గర్భిణులకు వైద్యపరీక్షలు, ఐరన్ ,కాల్షియం మాత్రలు, పిఎంఎంవివై పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులు గురించి సమీక్షించి రికార్డులు, రిపోర్టులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్‌వైఎస్ఆర్ విలేజ్‌హెల్త్‌క్లినిక్‌కు సంబంధించిన ఎంఎల్ హెచ్‌పిసిహెచ్‌ల గురించి ప్రజలకు అందించే సేవలు గురించి సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్, సూపర్వైజర్లు శివగౌరీ, కుమారి ఎంసిఎంపిలు, ఎఎన్ఎంలు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్‌అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల ధరణ్‌కుమార్

అంబేద్కర్ చిత్రపటంతో రిపబ్లిక్‌డేని జరుపుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

74వ గణతంత్ర దినోత్సవం విధిగా అంబేద్కర్ చిత్ర పటంతో జరుపుకోవాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుభాష్ డిమాండ్ చేశారు. బుధవారం పీలేరు మాలమహానాడు కార్యాలయంలో జిల్లా మాల మహానాడు ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26న ప్రతి సంవత్సరం జరుపుకునే గణతంత్ర దినోత్సవం రోజున గాంధీ మహాత్ముడి ఫోటో మాత్రమే పెట్టి కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, వాస్తవంగా రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు రాజ్యాంగాన్ని రచించినది డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఫోటో పెట్టక పోవడం దురదృష్టకరమని అన్నారు. ఇక నుంచి రిపబ్లిక్ దినోత్సవం రోజున తప్పకుండా అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టి కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-పీలేరు

ఆహారనియమాలతో ఆరోగ్యాన్ని కాపాడుకుందామని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం తలుపుల పిహెచ్‌సి పరిధిలోని గాండ్లపల్లి గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా అంటురహితవ్యాధులు-నివారణ చర్యలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అంటు రహిత వ్యాధుల్లో ప్రధానంగా అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధులు ప్రధానంగా చెప్పుకోవచ్చని అన్నారు. శరీరంలోని రక్త స్థాయిని మించి ఒత్తిడి అనారోగ్య స్థాయికి చేరే పరిస్థితిని అధిక రక్తపోటుగా, రక్తంలో అధిక చక్కర శాతం ఉండటంవల్ల, శరీరంలోని ఇతర అవయవాలకి దుష్ప్రభావం చూపే స్థితిని మధుమేహంగా చెప్పుకునే ఈ అనారోగ్యల్ని వైద్యుల సలహమేరకు వ్యాధిగ్రస్తులు మంచి అలవాట్లను ఆచరణలో పెడితే సమస్యల్ని అధిగమించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ బరువును అదుపులో ఉంచుకోవాలని, నిర్దేశించిన మేలైన ఆహారం ఎల్లవేళలా తీసుకోవాలన్నారు. శారీరక శ్రమలోభాగంగా రోజులో కనీసం 30 నిమిషాలు నడక మంచిదని, పొగతాగడం, మద్యంపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ కొండయ్య, కృష్ణయ్య, సిహెచ్ఒరాజేశ్వరి, ఎఎన్ఎంరేణుక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బియ్యం పట్టివేత

కొండాపురం : అక్రమంగా తరలిస్తున్న సర్కార్ బియ్యం, వాహనాన్ని కొండాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పొట్టిపాడు గ్రామానికి చెందిన జగన్నాథం నాగన్న అనే వ్యక్తి ఆటోలో 13బస్తాలు ప్రభుత్వ చౌకధాన్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. బియ్యం వ్యాపారి నాగన్నను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టిబి రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

టిబి రోగులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- రాయచోటి టౌన్

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ మాట్లాడుతూ దాతల సహకారంతో 140కు పైగా సేవా కార్యక్రమాలు పూర్తి చేసుకున్నామని, బ్రాహ్మణవీధిలోని కృష్ణ హాస్పిటల్ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ ఉషారాణి, ప్రముఖ వైద్యులు డాక్టర్ మహేశ్వర రాజు దంపతుల ఆర్థిక సాయంతో టిబి యూనిట్ రోగులకు పౌష్టికాహారాన్ని అందించినట్లు తెలిపారు. 60మంది టిబి రోగులకు ఆరు నెలలకు వరకు సరి పడా పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని అన్నారు. టిబి వ్యాధి గ్రస్తులకు పౌష్టి కాహారం చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. పౌష్టికాహారంతో రోగులు త్వరగా కోలుకుంటారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లయన్ సుందర్‌రాజు, నాయుడు, నందిని ట్రావెల్స్ వినోద్ కుమార్ నాయక్, భారతి స్కూల్ కరస్పాండెంట్ బసిరెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి లత, టిబి యూనిట్ సూపర్వైజర్ నాగేశ్వర్, ల్యాబ్ సూపర్వైజర్ గంగన్న, టిబి హెల్త్ విజిటర్ గంగాదేవి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ కవి సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఉర్దూకవి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని అంజుమన్ ఉర్దూఅధ్యక్ష , కార్యదర్శులు కె.హబీబుల్లాఖాన్, షేక్ మహమ్మద్‌హాషిం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన రాయచోటి డైట్ కళాశాలలో గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుండి అంజుమన్ తరఖీ, ఉర్దూ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశభక్తిపై ఉర్దూకవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి , డిఇఒ రాఘవరెడ్డి, హ్యూమన్ రైట్స్ సభ్యులు ఇర్ఫాన్ పాల్గొంటారని అన్నారు. కవిసమ్మేళనంలో ఉర్దూభాషా పండితులు, కవులు, విద్యావేత్తలు పాల్గొంటారని ఉపాధ్యాయులు, విద్యార్థులు, భాషాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

పెళ్లికి నిత్యావసర వస్తువులు వితరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విభిన్న ప్రతిభావంతురాలు మల్లేశ్వరి కూతురు పెళ్లికి టమాటా మర్చంట్ మల్లికార్జున, శ్రీలక్ష్మి కుబేర స్వర్ణ భైరవ ట్రస్ట్ సహకారంతో విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగులు, వయోవృద్ధుల కన్వీనర్ అఫ్జల్, గౌరవ అధ్యక్షులు చలపతిరావు ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెటలో నిత్యవసర సరుకులు, కూరగాయలు అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలరింగ్ చేసుకుని జీవనం సాగిస్తున్న, ధీన స్థితిలో ఉన్నా మల్లేశ్వరికి ముగ్గురు కూతుళ్లు. రెండవ కూతురి వివాహానికి బియ్యంప్యాకెట్, నిత్యవసర సరుకులు, కూరగాయలు పంపిణీ చాలా హర్షణీయమన్నారు. కార్యక్రమానికి సహకరించిన దాతలు, టమాటా మండి మర్చంట్ మల్లికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వికాస్ విహార్‌లో అన్నదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం నల్లబోతుల యూత్ ఆధ్వర్యంలో నల్లబోతుల నాగరాజు రామేశ్వరంలోని వికాస్‌విహార్ విభిన్నప్రతిభావంతులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ వినోద్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు షరీఫ్, తెలుగు యువత కార్యదర్శి పల్ల సాయిరాం, పెన్నానగర్ సుభాన్, మధు, ప్రసాద్, మాబుసున్న, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ..

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద గల భగవాన్ కాశీనాయన వృద్ధాశ్రమంలో చిన్నారి మహతి పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు కందుకూరు రఘు వీరశర్మ, నాగర్సి ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాగ్దాడం శివశంకర్, కందుకూరి శివమ్మ, వాగ్దాడం చంద్రశేఖర్, శ్రీ వినాయక ఫౌండేషన్ నిర్వాహకులు దీటి గోపాలకృష్ణయ్య, ఆశ్రమ నిర్వాహకులు వెంకటయ్య పాల్గొన్నారు.

వైఎస్ జయమ్మకు విజయమ్మ నివాళి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తల్లి వైఎస్ జయమ్మకు మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ నివాళులర్పించారు. జయమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె సమాధి వద్ద బుధవారం విజయమ్మ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల సర్పంచుగా జయమ్మ ప్రజలకు సేవలందించి, అవార్డు పొందారన్నారు. కార్యక్రమంలో వైఎస్ సుధాకర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, సిఎంఒ జనార్దన్‌రెడ్డి, కౌన్సిలర్ రమణ, డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంజెపిఎపి విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ హరిత తెలిపారు. బుధవారం రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నందలూరులో నిర్వహించిన కబడ్డీ, కోకో, చెస్, షటిల్, రన్నింగ్‌లో తమ విద్యార్థులు చంద్రకళ, శ్రీలత, వర్ష కబడ్డీలో ప్రతిభ చూపగా.. చెస్‌లో సునీత రాణించిందన్నారు. కోకోలో అమృత మేఘన, పార్వతి ప్రతిభ చూపగా.. షటిల్‌లో హర్షిని, రన్నింగ్‌లో గీత రాణించారని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సింహాచలంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాల విద్యార్థులు పేదలు కావడంతో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఆట వస్తువులు కొనుగోలుకు, విద్యార్థుల రవాణా ఖర్చులుకుగాను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగాల ఉషారాణి రూ.20 వేలు ప్రోత్సాహకం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉషారాణికి పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డుప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలైన సంఘటన కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. ములకలచెరువు మండలం బురకాయల కోట పంచాయతీ, మొరాలకు చెందిన దంపతులు చంద్రశేఖర్ (30), ఆశ(25)లు బైకులో సొంతపనిపై మదనపల్లికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా సర్కారుతోపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలికిరి

పట్టణంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2850 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. పేకాట రాయుళ్లతో పాటు మహల్ కు చెందిన ఆర్.నాగేశ్వరరావు అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో తనిఖీ చేసి అతని వద్ద నుండి 25 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.